# పాతికేళ్ళ జీవితంలో

-పెమ్మరాజు వేణుగోపాలరావు

మనిషికి మరుపు అవసరం. ప్రతి విషయం జ్ఞాపకం, ఉంచుకుంటే మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోండి ఒక సారి. బాధాకరమైన ప్రతి విషయం గుర్తుకి వస్తూంటే ఎంతచికాకుగా ఉంటుందో ఊహించుకోండి. పూర్వ జన్మలలో జరిగినవన్నీ గుర్తుకి వస్తే ఎన్ని జన్మల విశేషాలు మనలని కలవర పెట్టగలవో ఆలోచించండి. కాని జీవితం సాగటానికి జ్ఞాపకం కూడా అత్యవసరమే. మనకి కావలసినవి గుర్తు పెట్టుకోలేకపోతే కలిగే ఇబ్బందులు విడిగా వర్ణించ నక్కరలేదు. జ్ఞాపక శక్తిని వృద్ధి చేసుకోవటానికి అనేక సాధనలు, సాధనాలు కనిపెడతాం. మరొక ప్రకృతి రహస్యం ఏమంటే భవిష్యత్తుని ఊహించుకోవాలంటే మనభూతకాల వ్యవస్థలని జ్ఞాపకం తెచ్చుకోగలగాలి. ఆశక్తి కోల్పోయిన నాడు 'ముందు' గురించి ఆలోచనలు చెయ్యడం కష్టం.

పాతానుభవాలని స్మృతిపథంలోంచి బయటకులాగి భవిష్యత్తులో మార్గదర్శకులుగా మార్చు కోవటం మానవ సహజం - మానవ ధర్మం కూడాను. పాతికేళ్ల జీవితంలో జ్ఞాపకం ఉంచుకోదగిన విశేషాలు అనేకం ఉంటాయి. ప్రతివారి జ్ఞాపకాలు అందరికీ అక్కర్లేదు. పదిమంది జీవితాలని కలిపి, ఉద్ధరించి వాటి మధ్య వారధులు కట్టిన విశేషాలు మాత్రమే సంఘం జ్ఞాపకముంచు కుంటుంది. వ్యక్తి తన జ్ఞాపకశక్తిని పదిలపరుచు కుంటున్నట్లే సంఘం కూడా అనేక రకాల సాధనాలని ఉపయోగిస్తుంది. చరిత్ర సంఘపు జ్ఞాపకాల కట్ట. కొంత చిలవలు పలవులు పెట్టి జరిగిన సంగతులలో అవసరమైనవి చేకూర్చి, విశ్లేషించి మనముందు పెడుతుంది. అందుకనే చరిత్రకారులు మనకి ఉపయోగపడే వ్యక్తులు, అవసరమైన వ్యక్తులు.

నేను చరిత్రకారుడిని కాను. కాని నాకు జ్ఞాపకం ఉన్న కొన్ని విశేషాలు ఇతరులతో పంచుకోదగ్గవి. తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతాలని అనుభవిస్తూ, పోషించి ఉద్ధరిద్దామనుకునే జీవులు ఉత్తర అమెరికాలో చాలా మంది ఉన్నారు. న్యూజెర్సీ తెలుగు కళాసమితి అటువంటి సభ్యులతో కూడిన ఒక సంఘం అని నాకు తెలియటానికి కారణం కిడాంబి రఘునాథ్ గారితో ఉన్న పరిచయ స్నేహాలు. ఆయనతో పరిచయం ఎలా అయిందీ, ఆ స్నేహం ఎలా పెరిగింది గుర్తుకు తెచ్చుకొని ఇతరులతో పంచుకోదగిన విశేషమని నా అభిప్రాయం.

హ్యూస్టన్‌లో తానా సభలు జరుగుతున్న సమయం అది 1989. అట్లాంటానుంచి వచ్చిన మా బృందం గిరిజాకళ్యాణం నృత్యనాటిక ప్రదర్శించిన రోజు. ప్రోగ్రాము బాగా జరిగిందని అందరం సంతోషంతో ఉన్నాం. పాత్రధారులు ఒకరినొకరు అభినందన చేసుకుంటున్నారు స్టేజివెనకాల. స్టేజి ఎంట్రన్సులో ఒక కుర్చీలో కూర్చుని తమాషా అంతా చూస్తున్నారు ఒకాయన. ఎవరీయన, ఇలా కూర్చున్నారు ఒంటరిగా ఇంత హడావుడిలో అని ఒక క్షణం ఆలోచించి ఆయన్ని సమీపించాను. ఆయన వెంటనే లేచి "నమస్కారమండీ. మీతో రెండు నిముషాలు మాట్లాడాలని వెయిట్ చేస్తున్నాను. మీరు చాలా బిజీగా ఉన్నారు గదా అని ఇక్కడ కూర్చున్నాను మళ్ళీ దొరకరేమోనని." "చెప్పండి ఏమిటి విశేషం?" అన్నాను. "నాపేరు కిడాంబి రఘునాథ్, న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి తెలుగు జ్యోతి ఎడిటరుని" అని తనని పరిచయం చేసుకున్నారు. అదే మా ఇద్దరి స్నేహబాంధవ్యానికి పునాది పడిన ప్రథమ ఘట్టం అనుకోవచ్చు.

ఆనాటి స్టేజి వెనకాల సంభాషణ అంతా తెలుగుజ్యోతి గురించే. ప్రతి సంచికలో కాకపోయినా వీలయినంతవరకూ నేను రచనలు తెలుగుజ్యోతికి పంపిస్తానని వాగ్దానం చేశాను. అంతకు పూర్వం నాలుగునెలల క్రితం నుంచే మాకు తెలుగుజ్యోతి రెగ్యులరుగా వస్తోంది. చాలవరకు చేతితో వ్రాసిన పత్రిక, ఆంధ్రదేశంలో వెలువడుతున్న పత్రికలనుంచి జిరాక్సు చేసిన రచనలు కొన్ని కూడా ఉంటున్నాయి. హ్యూస్టనునుంచి తిరిగి అట్లాంటా వచ్చాక ఒక రోజున నేను అది వరకు వ్రాసిన "శ్రీ వెంకటేశ్వరుని పశ్చిమ దేశయాత్ర" అనే కవిత ఒకటి ఒక పేజీకి సరిపడ చేత్తో వ్రాసి పోష్టుచేశాను. అది అందిన వెంటనే ఆయన ఫోనులో కేకేసి "చాలా బాగుంది ఇది వచ్చే సెప్టెంబరు ఇష్యూలో వేస్తాను." అని, "మీరు ప్రతినెలా ఒక రచన తప్పకుండా పంపించాలి, ఏమయినా సరే" అంటూ బలవంతపెడుతూ సంభాషణ సాగించారు. వెంటనే నేను మర్యాదగా చెప్పాను, "నేను ప్రతి నెలా వ్రాయగలిగేటంత

సమయంగాని నమ్మకం గాని నాకు లేదండి. కాని ప్రస్తుతానికి నా 'కాస్మిక్ కవిత'లో వచ్చిన కవితలు మీకు కావలిసినవి ఎన్నుకుని వేసుకోండి" అన్నాను. "అహ అల్లాకాదు. మీరు కొత్తవి పూనుకుని వ్రాయాలి తెలుగుజ్యోతి కోసం" అన్నారు. ఆ సంభాషణలోనే ఆయనకి తను చేస్తున్న పనిలో ఉన్న పట్టుదల, ఉత్సాహాలు నాకు కనిపించాయి. నా అభిప్రాయలకి, ఆశయాలకి అనుగుణంగా ఈ వ్యక్తి చేస్తున్న కృషికి సాధ్యమయినంతవరకూ అండగా నిలబడి సమర్ధతతో సహకరించాలి అని మనస్సులో అనుకున్నాను.

కిడాంబి రఘునాధ్, తెలుగుజ్యోతులతో సంబంధం వల్ల జరిగిన నాలో ముఖ్యమైన మార్పు ఒకటి నేను చెప్పకోగలను. తెలుగులో మళ్ళీ రెగ్యులరుగా వ్రాయటం ప్రారంభించాను. అంతకు పూర్వం నాకు తోచినప్పుడు మాత్రమే అప్పుడప్పుడు కవితలు వ్రాస్తూండేవాణ్ణి. ఈ కనక్షను ఏర్పడ్డాక తెలుగులో వ్రాయటం ఎక్కువయింది అని ఖచ్చితంగా చెప్పగలను. లెక్క పెడితే షుమారు డెభై తెలుగు జ్యోతులలో నా రచనలు పడ్డాయి. ఈయనతో పరిచయం అయ్యాక నేను రాసిన కవితలన్నీ ముందుగా తెలుగుజ్యోతిలోనే ప్రచురింపబడ్డాయి. ఎవరయినా నన్ను పలకరించి "ఈమధ్య ఏమయినా కొత్త కవితలు రాశారా?" అని అడిగితే, "మీరు తెలుగు జ్యోతి తెప్పించుకోండి. నేను వ్రాసినవన్నీ ఆపత్రికలో పడతాయి" అని సమాధానం ఇవ్వటం నాకలవాటయిపోయింది. అప్పటినుంచి ఇప్పటి దాకా వచ్చిన తెలుగుజ్యోతుల కాపీలన్నీ మా బేసిమెంటులో లైబ్రరీలో పదిలపర్చి ఉంచాను. తెలుగు జ్యోతి వచ్చిన వెంటనే మా ఆవిడ లక్ష్మి చేతిలోకి వెళ్ళిపోయేది ముందు. రఘునాధ్ గారి ఎడిటోరియల్ ముందు చదివి తర్వాత మిగతావాటికేసి చూసేది.

తెలుగుజ్యోతితో సంబంధానికి దారితీసిన పూర్వ చరిత్ర ఒకటి ఉంది. 1970 నుంచి 1976 వరకు నేనూ మా మిత్రులు గవరసాన సత్యనారాయణ, పరిమి కృష్ణయ్య, రావిపూడి సుబ్బారావుగార్లు కలిసి తెలుగు బాషాపత్రిక నడిపాం. అది వ్రాతపత్రికగా ప్రారంభమై తరువాత ఇండియాలో అచ్చువేయించి తెప్పించేవాళ్ళం. ఇక్కడ స్థిరపడిన తెలుగువారిలో తెలుగులో రచన చేద్దామనే కుతూహలం ఉన్న వారిచేత సైన్సు సంబంధమైన విషయాలపై రచనలు వ్రాయించి ప్రచురించటానికి ఉద్దేశించిన పత్రిక అది. ఆప్రాజెక్టు విలువ గ్రహించిన వారిలో కిడాంబి రఘునాధ్ గారు ఒకరు.

పత్రికానిర్వహణలో ఉన్న సాధకబాధకాలు చాలా ఉన్నాయి. షుమారు రెండు దశాబ్దాల పాటు కిడాంబి గారు, వారి స్నేహితులు తెలుగు జ్యోతిని నడిపి అమెరికాలో ప్రవాసాంధ్రుల రచనా కుతూహలానికి, సృజనాత్మక శక్తికి నీరు పోసి పోషించారు. వారి సంపాదకవర్గంలో చేరి కొన్నాళ్ళు చేయూత నిచ్చాను కూడా. అమెరికాలో తెలుగు డైస్పోరిక్ సాహిత్యాన్ని గౌరవించి అది నిలబడటానికి ఒక చోటు చూపించిన మొదటి తెలుగు సంఘం న్యూజెర్సీ తెలుగు కళాసమితి అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు జ్యోతితో నాకున్న సంబంధం నా కథలో మరువలేని ఘట్టం. నాలాంటి వారు చాలా మంది ఉండటం వల్లనే ఈ సంస్థపై పదిమందికి వాత్సల్యం, అభిమానం, గౌరవం..

American Telugu TV
A Viewer Sponsor Network Nationwide
WATCH FREE ON DIRECT TV
&
DISHNETWORK
For Showtime
www.americantelugutv.com
408 454 6240

SATYA SRIKONDA, CTC
PRESIDENT
Shanthi Travel
194 DIAMOND BRIDGE AVE.
HAWTHORNE, N.J. 07506 Outside
NJ : 1-800-SHANTHI 973 423-4444
Fax: 973 423-4459
shanthitravel@hotmail.com
shanthitravel_99@yahoo.com
Travel Services